# ఆంధ్రప్రదేశ్
# సమాజ ఆధారిత చెరువుల యాజమాన్య పథకం

సమాచార పత్రిక - 4

ఏప్రియల్-జూన్ 2010


- సంపాదకీయం
- ఆయకట్టుదారుల కుటుంబాలు
- పరిపాలన పరమైన అనుమతులు
- ప్రాజక్టు సారాంశం
- సంస్థాగత అభివృద్ధి
- భాగస్వామ్య భూగర్భజల యాజమాన్యం
- వ్యవసాయ ఆధారిత జీవనోపాధుల సహాయక సేవా కార్యక్రమము




రాష్ట్ర ప్రాజక్టు సంచాలకులు
ఆంధ్రప్రదేశ్ సమాజ ఆధారిత చెరువుల యాజమాన్య పథకం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# సంపాదకీయం

రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ సామాజిక చెరువుల యాజమాన్య పథకం ప్రారంభమై మూడు సంవత్సరములైనది. దీనిలో భాగంగ 275 చెరువులు పునరుద్ధరింపబడినవి. తరువాత, ఈ చెరువుల నిర్వహణ మరియు యాజమాన్య బాధ్యతను నీటి వినియోగదారుల సంఘం చేపట్టవలసి వుంది.

ఈ చెరువుల పథకం ద్వార మంచి అనుభవాలు అందుతున్నాయి. ఈ సంచికలో చిన్నకారు రైతులు, చెరువు నీటి ద్వార సాధించిన ఉత్పాదకత మరియు జీవనోపాదులను పెంపుదలను తెలపడమైనది. విజయగాథల ద్వార చెరువుల పథకం యొక్క ఉద్దేశ్యాలు ఆచరణ సాధ్యమని నమ్మకం కలుగుచున్నది.

పాడి పరిశ్రమ ద్వార 22 లక్షల ఆదాయాన్ని గొల్లమాడ గ్రామ మహిళలు సంపాదించగలిగారు. అదేవిధంగా , నాగసముద్రం గ్రామములో చేపల పెంపకం ద్వార అధిక ఉత్పత్తి మరియు ఆదాయము మూడు రెట్లు పెరిగినది. రామిరెడ్డి అనే రైతు తాను వాడుకొనగా మిగిలిన నీటిని ఇతర రైతులకు అందించి వారి పొలాలను ఎండకుండ కాపాడగలిగి 'నీటి బాంధవుడు' అయినాడు. రామస్వామి అనే రైతు వరి నుండి మొక్కజొన్నకు పంట మార్పిడి చేయడం ద్వారా అద్భుతమైన ఫలితాలను సాదించాడు.

'శ్రీ'వరి వ్యవసాయం అమలు చేయడం ద్వార సన్నకారైన సరస్వతమ్మ 'స్వయంకృషి' అన్నిటికన్న మిన్న అని ఋజువు చేసింది. అన్ని సామాజిక వర్గాలకు చెందిన సుమారు మూడు లక్షల చిన్న మరియు సన్నకారు రైతులు ఆంధ్రప్రదేశ్ సామాజిక చెరువుల భాగస్వామ్య పథకం ద్వారా అభివృద్ధి చెందినారు.

ఇదే విధంగా ఈ సమాజ ఆధారిత చెరువుల యాజమాన్య పథకం ద్వారా చేపల పెంపకం, పశుపోషణ, భాగస్వామ్య భూగర్భజల యాజమాన్యం మొదలైన కార్యక్రమాల ద్వార రైతులకు మంచి లాభాలు అందుతున్నాయి.

**ప్రాజక్టులోని ఆయకట్టుదారుల కుటుంబాల సంఖ్య**




సామాజిక వర్గాల వారిగా
కుటుంబాల సంఖ్య మరియు శాతం




నీటి సంఘ సరాసరి కుటుంబాలు




కుటుంబానికి సరాసరి ఆయకట్టు (హెక్టార్లు)

**కవర్ పేజ పాటో:** వరంగల్లు జిల్లా, వర్ధన్నపేట మండలం, పున్నెల గ్రామంలోని ఎల్లమ్మ చెరువు కాలువ పని చేయుచున్న నీటి వినియోగదారుల సంఘ సభ్యులు

# ప్రాజక్టు సారాంశము

## పరిపాలన పరమైన అనుమతులు

| నెం. | జిల్లా | చెరువులు | ఆయకట్టు (హెక్టార్లలో) | పరిపాలన పరమైన అనుమతులు | | |
|---|---|---|---|---|---|---|
| | | | | చెరువులు | ఆయకట్టు (హెక్టార్లలో) | విలువ రూ. (లక్షలలో) |
| 1 | ఆదిలాబాద్ | 57 | 6458 | 56 | 5390 | 1476 |
| 2 | అనంతపురం | 142 | 17439 | 142 | 16478 | 3685 |
| 3 | చిత్తూరు | 167 | 17106 | 161 | 14607 | 3448 |
| 4 | తూర్పు గోదావరి | 20 | 9765 | 18 | 1689 | 55 |
| 5 | కడప | 63 | 1583 | 63 | 9732 | 2062 |
| 6 | కరీంనగర్ | 67 | 7378 | 67 | 7389 | 1898 |
| 7 | ఖమ్మం | 104 | 17159 | 103 | 14711 | 3807 |
| 8 | కృష్ణా | 52 | 8401 | 52 | 7852 | 2130 |
| 9 | కర్నూలు | 44 | 5971 | 44 | 4185 | 1490 |
| 10 | మహబూబ్‌నగర్ | 277 | 26378 | 271 | 25954 | 6013 |
| 11 | మెదక్ | 192 | 18676 | 190 | 17412 | 4670 |
| 12 | నల్గొండ | 136 | 13027 | 127 | 11160 | 2610 |
| 13 | నెల్లూరు | 124 | 23141 | 124 | 22912 | 5140 |
| 14 | నిజామాబాద్ | 46 | 6115 | 46 | 6093 | 1527 |
| 15 | ప్రకాశం | 39 | 6750 | 38 | 6619 | 1653 |
| 16 | రంగారెడ్డి | 41 | 6308 | 40 | 6225 | 1628 |
| 17 | శ్రీకాకుళం | 87 | 7503 | 75 | 7437 | 1856 |
| 18 | విజయనగరం | 127 | 11506 | 80 | 6589 | 1601 |
| 19 | విశాఖపట్నం | 92 | 11887 | 76 | 6366 | 1458 |
| 20 | వరంగల్ | 117 | 16653 | 115 | 15668 | 3574 |
| 21 | పశ్చిమ గోదావరి | 14 | 4082 | – | – | – |
| | **మొత్తము** | **2008** | **243286** | **1888** | **214468** | **51781** |

## షెడ్యుల్డ్ తెగల నీటి వినియోగదారుల సంఘాలకు 50,000 రూ జీవనోపాధుల నిధి

సామాజిక పర్యావరణ యాజమాన్య ప్రక్రియ ద్వార షెడ్యూల్డ్ తెగల నీటి వినియోగదారులకు లబ్దిచేకూర్చుటకొరకు ప్రణాళికలు రూపొందించబడినవి. టింప్, ప్రణాళికల తయారిలో మరియు అమలులో షెడ్యూల్డ్ తెగల రైతులు చురుకుగా పాల్గొనేటట్లు ప్రోత్సహించడం జరిగినది. దీని క్రింద 59 సంఘాలలో 50 శాతము పైగ షెడ్యూడ్ల తెగల నీటి వినియోగదారులున్నారు (10,693 కుటుంబాలు) వారి టింప్‌ను షెడ్యూల్డ్ టింప్‌గా పరిగణిస్తారు. ఇందులో ఖమ్మం జిల్లా అత్యధికంగా 39 చెరువులు మరియు 6,893 కుటుంబాలతో అగ్రగామిగా వుంది.

ఇక రెండవ తరగతిలో 77 చెరువులలో (3,835 కుటుంబాలు) 10 నుండి 50 శాతం మంది షెడ్యూల్డ్ కుటుంబాల నీటివినియోగ దారుల సభ్యులున్నారు. ఇందులో కూడ 14 చెరువులలో 1,158 కుటుంబాలతో ఖమ్మం జిల్లా అగ్రగామిగా యున్నది. ఇదే క్రమంలో మహబూబ్‌నగర్ జిల్లాలో 20 నీటి వినియోగదారుల సంఘాలలో 1,154 షెడ్యూల్డ్ జాతుల కుటుంబాలు ఉన్నవి. మొత్తం 77 నీటి వినియోగదారుల సంఘాలు జీవనోపాదుల నిధి క్రింద రూ. 50,000 ప్రకారం లబ్దిపొందుటకు అర్హత పొందినవి.

| అంశాలు | యూనిట్ | సంఖ్య✦ |
|---|---|---|
| **సంస్థాగత అభివృద్ధి** | | |
| ప్రాజక్టుతో సహాయసంస్థలు | నం | 259 |
| సహాయ సంస్థలకు కేటాయించిన చెరువులు | నం | 2008 |
| తయారు చేయబడిన చెరువు అభివృద్ధికి యాజమాన్య ప్రణాళికలు | నం | 1865 |
| శిక్షణ పొందిన నీటివినియోగదారుల సంఘం యాజమాన్య కమిటీ సభ్యులు | నం | 25118 |
| శిక్షణ పొందిన నీటివినియోగదారుల సంఘం ఉప సంఘాల సభ్యులు | నం | 24338 |
| శిక్షణ పొందిన పారా వర్కర్లు | నం | 5114 |
| కార్పస్ నిధి (రూ॥లో) | లక్షల్లో | 330 |
| **చిన్ననీటి పారుదల చెరువుల అభివృద్ధి** | | |
| *పరిపాలనాపరమైన మంజూరీలు* | చెరువులు | *1888* |
| *సాంకేతిక మంజూరీలు* | చెరువులు | *1790* |
| *నీటి వినియోగదారుల సంఘం పనుల ప్రారంభం* | చెరువులు | *1741* |
| *ప్రారంభింపబడిన టెండరు పనులు* | చెరువులు | *1109* |
| ■ *100 శాతం పనులు పూర్తి అయిన చెరువులు* | చెరువులు | *275* |
| ■ 75-100 శాతం పనులు పూర్తి అయిన చెరువులు | చెరువులు | 133 |
| ■ 50-74 శాతం పనులు పూర్తి అయిన చెరువులు | చెరువులు | 164 |
| ■ 25-49 శాతం పనులు పూర్తి అయిన చెరువులు | చెరువులు | 137 |
| ■ 01-24 శాతం పనులు పూర్తి అయిన చెరువులు | చెరువులు | 400 |
| **భాగస్వామ్య భూగర్భజల యాజమాన్యం (PGM)** | | |
| ఎంపిక చేయబడిన చెరువులు | నం | *315* |
| ఏర్పాటు చేయబడిన పిజియమ్ గ్రూపులు | నం | 2124 |
| పిజియమ్ గ్రూపుల్లో సభ్యులు | మగ | 17437 |
| పిజియమ్ గ్రూపుల్లో సభ్యులు | ఆడ | 16086 |
| పిజియమ్‌లో శిక్షణ పొందిన రైతులు | | |
| ■ భాగస్వామ్య భూగర్భజల యాజమాన్య అవశ్యకత మరియు అంచనా | నం | 1890 |
| ■ భాగస్వామ్య నీటి పర్యవేక్షణ పరికరాల వాడకం | నం | 954 |
| ■ పంటనీరు ప్రణాళిక | నం | 594 |
| సమాచారం సేకరిస్తున్న పిహెచ్‌ఎమ్ వాలంటీర్లు | నం | 530 |
| **వ్యవసాయ ఆధారిత జీవనోపాధుల సహాయసేవా కార్యక్రమాలు** | | |
| ప్రదర్శనా క్షేత్రాలు ఏర్పాటు | నం | 1711 |
| ఏర్పాటు చేసిన కిసాన్ మేళాలు | నం | 788 |
| వదిలిన చేపపిల్లలు *(288 చెరువుల్లో)* | లక్షల్లో | *293* |
| శిక్షణ పొందిన గోపాలమిత్రలు | నం | 378 |

✦ 30 జూన్ 2010 వరకు వివరాలు

ఈ నిధిని వానపాముల ఎరువులు, బయోగ్యాస్, వేపనూనె తీసే యంత్రాలు విత్తన నిధి, పిండిగిర్ని, స్ప్రేయర్, విండ్‌బ్లోయర్ మరియు వివిధ వ్యవసాయ ఉపకరణాలు కొనుటకు ఉపయోగించుదురు.



కొత్తపల్లి గ్రామంలో షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి ప్రణాళిక తయారి

# సంస్థాగత అభివృద్ధి

## చిన్న చెరువు- పెద్ద నిధి

"మా చెరువు చిన్నదే కావచ్చు, కాని భవిష్యత్తు నిధిమాత్రం ఎక్కువే". కరీంనగర్ జిల్లాలోని సైదాపూరు మండలంలో గల మారుమూల గ్రామం అమ్మన్‌గురి ఊరు. ఈ గ్రామంలో చిన్ననీటి పారుదల శాఖకు సంబంధించి ఒక చిన్న చెరువు వున్నది. ఈ చెరువుకు సంబంధించి సాగు నీటి వినియోగదారుల సంఘం, 1997 ఆంధ్రప్రదేశ్ రైతుల యాజమాన్య సాగునీటి చట్టంనకు అనుగుణంగా ఏర్పాటు అయినది. ఈ సాగునీటి వినియోగదారుల సంఘానికి శ్రీ బుచ్చయ్యగారు అధ్యక్షుడుగా కిందటి ఎన్నికలలో ఎన్నుకోబడినారు. ఈ సంఘం అభివృద్ధిదశ ఒక్కసారిగా మారడానికి నాంది అయినది. అప్పటి వరకు ఈ సంఘం నిర్జీవమైయున్నది. ఈ చెరువు క్రిందవున్న ఆయకట్టుదారులందరు సన్న, చిన్నకారు రైతులే. ఈ చెరువుక్రింద 151 ఎకరాల ఆయకట్టు కలదు.

రెండు సంవత్సరాల క్రితం ఈ చెరువు ఆంధ్రప్రదేశ్ సమాజ ఆధారిత చెరువుల యాజమాన్య పథకం క్రింద పునరుద్ధరణ కార్యక్రమాలకొరకు గుర్తించబడినది. ప్రాజక్టు క్రింద గుర్తించిన తర్వాత ఇండియన్ సోషల్ సర్వీసు సొసైటి, కరీంనగర్ వారికి సంఘబలోపేత కార్యక్రమాల పనిని అప్పగించడం జరిగినది. ప్రాజక్టు కార్యక్రమాల ప్రారంభదశలో అయకట్టు రైతులలో మంచి స్పందన లేదు. సమావేశాల సంఖ్య పెరిగిన కొద్ది రైతులలో అవగాహన పెరగడం ద్వారా స్పందన పెరిగింది. ఈ స్పందనను ఆధారం చేసుకొని 1999 కరీంనగర్‌లో సంఘం నందు ఉప కమిటీలు ఏర్పాటు చేయడం, ప్రజల భాగస్వామ్యంలో గ్రామం, చెరువు, రైతులు మరియు పంటలకు సంబందించి పూర్వాపరాలు తెలుసుకొని చెరువు అభివృద్ధికి సంబంధించి సంపూర్ణ ప్రణాళికను తయారుచేయడం జరిగినది. అప్పటి నుంచి ఆయకట్టుదారుల సహకారం పెరిగినది. ఈ ప్రణాళిక ప్రకారం 14 లక్షల 60 వేల రూపాయల అంచనాలతో కార్యక్రమాల రూపకల్పన జరిగినది. ఇందులో భాగంగా నీటి సంఘంవారికి 5 లక్షల రూపాయల విలువ కలిగిన పని కేటాయించడం జరిగినది.

"సంఘ సభ్యులు పరివర్తన చెంది చెరువు భవిష్యత్తులో మరమ్మతు, నిర్వహణ క్రార్యక్రమాలకు నిధి అవసరమని గుర్తించడం జరిగినది. ఇందులో భాగంగా కనీసం 75 వేల రూపాయలు అవసరమని అంచనా వేసి అందులో మొదటి విడతగా **38, 600 నిధిని సేకరించి సంఘం యొక్క నిర్వహణ యాజమాన్య ఖాతా నందు జమచేయడం జరిగినది. గత మూడు సంవత్సరములనుండి నీరు రాక పన్ను కట్టక ప్రభుత్వం నుండి సంఘానికి పన్ను మొత్తం నుండి వాపసు చేయబడే నిధికి అవకాశము లేక పోవుట వలన సంఘం ఇతర ఆదాయమార్గాలపై దృష్టి పెట్టి భవిష్యత్తు నిధిని పెంచే ప్రయత్నం మొదలుపెట్టింది."**


నీటిసంఘం మరియు గ్రామపంచాయతి ప్రతినిధులతో చర్చిస్తున్న జిల్లా ప్రాజక్టు అధికారి

నీటి సంఘం ఉపాధ్యక్షుడైన శ్రీ సమిరెడ్డి చెరువు కట్ట పైన మరియు చెరువుతీర ప్రాంతంలో వున్న నిరుపయోగమైన మొక్కల గురించి సంఘ సభ్యులకు వివరించడం జరిగినది. అయితే అదే ఆలోచనతో గ్రామ పంచాయతి వారు కూడా వీటిద్వారనే ఆదాయాన్ని పెంచతలపెట్టిరి. అటువంటి సందర్భంలో నీటి సంఘంవారు చెరువుపై హక్కుల గురించి మండల రెవిన్యూ ఆఫీసర్‌ను సంప్రదించి వారి వాదనలను వివరించడం జరిగినది. అప్పుడు మండల రెవిన్యూ ఆఫీసర్ సంఘ హక్కులను దృవీకరిస్తూ వారికి అనుకూలంగా తీర్పునివ్వడం జరిగినది. పైన చెప్పిన నిరుపయోగమైన మొక్కల నుండి వచ్చిన లక్షఇరవై వేల రూపాయలను సంఘం నిర్వహణ యాజమాన్య ఖాతాలో జమచేయడం జరిగినది. ఈ ఖాతానందు మొత్తం 1,58,600 రూ.లు నిల్వ వున్నది.

ఈ లోపల నీటి సంఘం ఎన్నిలు రావడం శ్రీ బుచ్చయ్యగారే తిరిగి ఎన్నిక కావడం జరిగినది. అయితే సంఘపాలక కమిటీలోని సభ్యులు ఈ నిధికి ఇతర అవసరాలకు వాడాలని ప్రయత్నించి విఫలమైనారు. నీటి సంఘసభ్యులు భవిష్యత్తు నిధి అవసరాన్ని గుర్తించి, ***రూ. 1,20,000/- బాంకు నందు ఫిక్సడ్ డిపాజిట్ చేయతలంచినారు. సంవత్సరానికి 8% వడ్డీతో 36 నెలలపాటు ఫిక్సడ్ డిపాజిట్ చేయడం జరిగినది.*** దీనివలన రూ. 32,189/- వడ్డీ ఆదాయం పెంచుకొనుటకు వీలుకలిగినది.

ఈ విధంగా నీటి సంఘ నిర్వహణ మరియు యాజమాన్య ఖాతా నందు **2 లక్షల రూపాయల నిధిని పెంచుటకు అవకాశము కలిగి అత్యవసర పనులకు నిధిని రిజర్వు చేయడం జరిగినది.**

ఈ విధంగా బుచ్చయ్యగారి ఆధ్వర్యంలో చెరువు భవిష్యత్తు అవసరాలకు నిధి ఏర్పాటును విజయవంతంగా చేయడం జరిగినది. ఇది ఇతర నీటి సంఘం సభ్యులకు ఒక మార్గదర్శకంగా కూడా చెప్పబడుతున్నది.



ఫిక్సడ్ డిపాజిట్ చేసిన చెరువు భవిష్య నిధి పత్రం

# భాగస్వామ్య భూగర్భజల యాజమాన్యం

## నీటి దాతగా మారిన బస్సు డ్రైవరు శ్రీ జి.రామిరెడ్డి

### నీటి పంపకం- సామాజిక సమానత్వం

శ్రీ గగనపల్లి రామరెడ్డి, నల్గొండ జిల్లా, పెద్దవూర మండలం, చాలకుర్తి గ్రామస్తుడు. రైతు కుటుంబంలో జన్మించి, 8 సం॥లుగా ఎ.పి.ఎస్.ఆర్.టి.సి లో డ్రైవరు ఉద్యోగం చేయుచున్నాడు. భూమాత మరియు సేద్యంతో ఇప్పటికీ సంబంధం కొనసాగిస్తున్న మనిషి.

రాంరెడ్డి, తను ఉద్యోగి అయివుండి నీటిదాత అయిన వైనం తన భాషలో ఈ విధంగా చెప్పాడు. “ నేను, నా భార్య మాకున్న *6* ఎకరాల పొలాన్ని దున్ని, మాకున్న ఒక కుమార్తె మరియు ఒక కుమారుణ్ణి పోషించు కుంటున్నాము. మాకు ఒకప్పుడు రెండు బోరుబావులు ఉండి వాటి నీటితో సేద్యము చేసేవాడిని. రానురాను ఆ బోరుబావులు ఎండి పోవడంతో మరి రెండు బోరు బావులను *700* అడుగులు మరియు *130* అడుగుల వరకు తవ్వి $5^1/_2$ ఎకరాలకు సరిపడా నీటిని పొంది వ్యవసాయం చేస్తున్నాను. *4* ఎకరాలు వరిపొలము, *1* ఎకరము బత్తాయితోట మరియు అర్ధ ఎకరము పశుగ్రాసం పంట నా పంట రకాలు.”

“మల్లన్న అనే సన్నకారు రైతుకి *75* సెంట్ల భూమి నా పొలానికి ఆను కుని ఉంటుంది. వానాకాలంలో తన పొలంలో *3* క్వింటాళ్ళ పంట పండించాడు. దాని విలువ రూ.*3,120/-*. రబి కాలంలో ఆ బావి నుండి సరిపడే నీరు వచ్చే అవకాశం లేని తరుణంలో కూడా మల్లన్న వరిమడి నాటాడు. సరిగ్గా కోతలకు ఒక నెల ముందు అతని బావి ఎండిపోయి, పొలము నుండి పంట చేజారిపోయే పరిస్థితిలో, నా కున్న ఒక బోరు నుండి అతనికి సరిపడే నీళ్ళను అందించాను. సరైన సమయంలో సరిపడే నీరు అందేసరికి అదే పొలం నుండి మల్లన్న *18* క్వింటాళ్ళ వరిని కోసి రూ.*17,000/-* సంపాదించాడు. మల్లన్న ఆనందంతో తబ్బిబ్బైపోవడం చూసి నా కళ్ళు చెమర్చాయి.”

మల్లన్నకు స్వంతగా బోరుబావి తవ్వే ఆర్థిక స్థోమతలేదు. కాని రామిరెడ్డి యొక్క దయార్ద్ర గుణం, మల్లన్న కుటుంబాన్ని పస్తుల బారినుండి కాపాడింది. తను చేసిన సహాయం వల్ల జరిగిన మేలు రామిరెడ్డిని తన రెండవ బోరుబావి నుండి కూడా వేరొక రైతు కుటుంబాన్ని ఆదుకోవడానికి శ్రీమతి చిన్నమ్మ ప్రోత్సహించింది.


సాగు అయిన చెన్నమ్మ పొలము

చిన్నమ్మ తన కృతజ్ఞత ను ఇలా చెప్పుకొచ్చింది. “మాకున్న ఒకటిన్నర ఎకరా భూమిలో తక్కువ స్థోమతగల బోరు బావి ఉంది. దానితో పోయిన సంవత్సరము అనావృష్టిలో 11.5 క్వింటాళ్ళ వరి పండించి రూ.11,000/- సంపాదించాము. కాని ఈ సారి రామిరెడ్డిగారు దానం చేసిన బోరు నీటితో 20 క్వింటాళ్ళ కంటే ఎక్కువ వరి పండించి రూ. 21,000/- సంపాదించాము. అందుకే అతనికి చేతులెత్తి నమస్కరిస్తాము. - ఆయన నీటి దాత.”

తన అనుభవం మీద రామిరెడ్డి ఉవాచ **“తక్కువ నీరు - డబ్బు ఎక్కువ. రైతు ఎల్లప్పుడూ తక్కువ నీరు అవసరమయ్యే పంటలను పండిస్తే ఎక్కువ పంటలను బిందుసేద్యం ద్వారా పండించవచ్చు. రబీకాలంలో కూరగాయల మరియు ఫలవృక్షాల పంట ఎంతో మేలు.**

**నేను ఒక ఎకరం విస్తీర్ణంలో నా బోరుబావి క్రింద వంకాయ పంట పండించి రూ.2 లక్షలను సంపాదించి నా కుమారుణ్ణి మరియు కుమార్తెను కర్నూలులోని ఒక మంచి గురుకుల పాఠశాలలో చదివిస్తున్నాను.”**

మానవ మనుగడకు నీరు చాలా ముఖ్యం. భూగర్భ జల యాజమాన్యం అనే ప్రక్రియ ద్వారా జరుగుతున్న కార్యక్రమంతో నాకు భూగర్భజలం, దానికి సంబంధించిన అనేక విషయాలపై మంచి అవగాహన కల్గింది. నేనై స్వతహాగా నా బోరు బావిలో నీటి మట్టం కొలతలు కొలవడానికి ఒప్పుకొని, సంబంధిత సమాచారాన్ని పథకంలో ముందంజ వేయడానికి నా చేతనైన సహాయాన్ని అందిస్తున్నాను. నేను చేస్తున్న ప్రయత్నంవలన విచక్షణాయుత నీటి వినియోగము, కట్టుబాట్లు తెలుస్తాయని భావిస్తున్నాను.

**“అవసరమైన వారికి నీటిని పంచి మీరు ఒక నీటిదాత అవ్వండి”**

## ‘శ్రీ’ వరిసాగు తో షెడ్యూలు తెగ రైతుల ముందంజ

ఖమ్మం జిల్లాలో పినపాక మండలములో రాజుపాలెం ఒక మారుమూల గ్రామము. ఇది ఖమ్మం నుండి 220 కి.మీ దూరములో ఉన్నది. ఈ గ్రామ జనాభా (1500 మంది) లో 95 శాతము షెడ్యూల్డు తెగలకు చెందినవారు. వారి భూకమతములు 0.4 నుండి 1.2 హెక్టారులుగా ఉండి వరిపైరు దిగుబడి ప్రతి హెక్టారుకు షుమారు 55 క్వింటాళ్ళు మాత్రమే వచ్చుచున్నది.

ఈ గ్రామములో శ్రీ జి. రామనాథమనే అభ్యుదయ రైతు శ్రీవరిసాగులో మన ప్రాజెక్టు సహాయముతో ప్రదర్శన క్షేత్రము ఖరీఫ్ 2008-09 లో నిర్వర్తించినాడు. ఈ రైతుకు ‘శ్రీ’వరిసాగులో మెళుకువలలో మండల వ్యవసాయ అధికారి మరియు ప్రాజక్టు సిబ్బంది శిక్షణ యిచ్చినారు. ఈ శిక్షణ కార్యక్రమములో శ్రీ రామనాథంతో సహ పది మంది రైతులు పాల్గొన్నారు. ‘శ్రీ’ వరిసాగుతో ఈ రైతు ఎకరమునకు 75 క్వింటాళ్ళు దిగుబడి సాధించినారు.

ఈ గ్రామరైతులు ‘శ్రీ’వరిసాగులోని మెళుకువలు గమనించి, వాటిని

| వివరములు | ప్రదర్శన క్షేత్రము | సాధారణ క్షేత్రము | అధిక ఆదాయములు |
|---|---|---|---|
| వ్యవసాయపు ఖర్చు రూ./హె. | 39,550 | 44,750 | 5,200 |
| దిగుబడి క్వింటాలు / హె. | 75 | 55 | 20 |
| మొత్తము ఆదాయము రూ./ హె. | 75,000 | 55,000 | 20,000 |
| నికరాదాయము రూ. / హె. | 35,450 | 10,250 | 25,200 |

**క్షేత్రపాఠశాలలో నేర్చుకున్న పద్ధతులు 2009-10లో అవలంభించిన రైతులు**

| క్ర. సంఖ్య | రైతు పేరు | విస్తీర్ణము | దిగుబడి క్వి / హె |
|---|---|---|---|
| 1 | కొమరం నారాయణ | 0.405 | 65 |
| 2 | ఉసం లాలయ్య | 2.024 | 60 |
| 3 | ఉసం ఈశ్వరయ్య | 1.619 | 75 |
| 4 | పాయం యేసు | 0.810 | 60 |
| 5 | తుమ్మ వెంకటయ్య | 1.215 | 65 |
| 6 | కుంజ రంగయ్య | 1.215 | 68 |
| 7 | కొమరం వెంకటయ్య | 0.810 | 70 |
| 8 | పాయం నీలయ్య | 0.810 | 70 |
| 9 | చెరప సన్యాసి | 1.215 | 65 |
| 10 | ఐరప శేఖర్ | 1.215 | 70 |
| | మొత్తం | 11.338 | 668 |

పాటించి లాభపడినారు. ప్రస్తుతము ఈ చెరువు క్రింద 11 హెక్టార్లలో ‘శ్రీ’వరిసాగు చేయుచున్నారు. తద్వారా సగటున 5 క్వింటాలు ప్రతి హెక్టారుకు అధిక దిగుబడి సాధించినారు.

‘శ్రీ’వరిసాగు గురించి అభ్యుదయ రైతు శ్రీ రామనాథం మాటల్లో “ **ఈ సాగులో వినియోగము, అధిక దిగుబడి మరియు పెరిగిన ఆదాయము వలన మా రాజుపాలెము గ్రామములో వచ్చే ఐదు సంవత్సరములో షుమారు 70 శాతం రైతులు ఈ విధానమును అవలంభించే ఆస్కారము ఉన్నదని, సగర్వముగ చెప్పగలను**” అని చెప్పారు.

# వ్యవసాయ ఆధారిత జీవనోపాధుల సహాయక సేవా కార్యక్రమము

## రామస్వామి విజయగాథ


మొక్కజొన్న పొలంలో రామస్వామి దంపతులు

చిత్తూరు జిల్లా, పి.టి.యమ్ మండలము, మదుమూరు గ్రామ అభ్యుదయ రైతు అయిన **కె. రామస్వామి** మొక్కజొన్న పంటను ప్రదర్శన క్షేత్రముగా రబి 2008-09 నందు చేయుటకు సంసిద్ధత వ్యక్తము చేసినాడు.

చైతన్య సహాయక సంస్థ సహకారముతో రామస్వామి స్థానిక వ్యవసాయ అధికార బృందము ద్వార మొక్కజొన్న పైరు సాగు మెళకువలలో శిక్షణ పొందినాడు. ఈ శిక్షణలో ముఖ్యముగ విత్తన సేకరణ, విత్తన శుద్ధి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు మరియు ఎరువులు మరియు సూక్ష్మపోషకములు యాజమాన్యము గురించి రామస్వామితోసహ షుమారు 20 మంది రైతులు పాల్గొన్నారు. మొక్కజొన్నపెంపకములో అధునాతన సాంకేతిక పరిజ్ఞాన అంశములు ఈ ప్రదర్శన క్షేత్రములో పాటించారు.

ఈ ప్రదర్శన క్షేత్రములో రామస్వామి అనుభవము అతని మాటలలో “నేను మొక్కజొన్న అధునిక పరిజ్ఞానముతో వ్యవసాయము చేసాను. నేను సాగుచేసిన అర్ధఎకరములో 15 క్వింటాళ్ళు మొక్క జొన్న ఉత్పత్తి చేసాను, అదే ప్రక్కరైతుల పొలములో యిది కేవలము 12.4 క్వింటాళ్ళు మాత్రమే వచ్చినది. ప్రదర్శన క్షేత్రములో నేను రూ 500/- ల తక్కువ ఖర్చు తోనే సాగు చేసినాను. అయినప్పటికి నాకు రూ.3,310 లు అధిక ఆదాయము వచ్చినది.”

రామస్వామి సాధించిన ఫలితాల ఆధారముగా అదే గ్రామములో 25 మంది రైతులు మొక్కజొన్న సాగులో ఈ ప్రదర్శన క్షేత్రములో అనుసరించిన మెళుకువలు పాటించగా మొక్కజొన్నసాగు 5 ఎకరములు (2008-09 ) నుండి 32 ఎకరములకు విస్తరించబడినది. మొక్కజొన్న పైరు సాగులో **మదుమూరు రైతులు ఎక్కువ లాభదాయకముగా భావించి సాంప్రదాయకపు పైరుకు బదులు ఈ సాగు మేలని గుర్తించారు.**

| విధానము | ప్రదర్శన క్షేత్రము | సాధారణ క్షేత్రము | అధిక లాభాదాయములు |
|---|---|---|---|
| వ్యవసాయపు ఖర్చు రూ./హె. | 23,000 | 25,550 | 2550 |
| దిగుబడి క్వింటాలు / హె. | 75 | 62 | 13 |
| మొత్తము ఆదాయము రూ./ హె. | 80,000 | 66,000 | 14,000 |
| నికరాదాయము రూ. / హె. | 57,000 | 40,450 | 16,550 |

## ‘శ్రీ’ వరిసాగు మార్గదర్శి శ్రీమతి సరస్వతమ్మ


శ్రీ’వరి ప్రదర్శనా క్షేత్రం

కడప జిల్లా, సుండుపల్లి మండలము, చెరువు క్రింద పల్లె గ్రామం, కృష్ణారెడ్డి చెరువు ఆయకట్టు క్రింద శ్రీమతి తిరుమలరెడ్డి సరస్వతమ్మ అనే రైతు అర ఎకరము పొలము కల్గివుంది. ఆ చెరువు ఆయకట్టు క్రింద అందరు రైతులు వరిసాగు ఖరీఫ్ మరియు రబి నందు చేయుచున్నారు. మన ప్రాజెక్టు ద్వారా సెప్టెంబరు 2008 న రైతు సదస్సు నిర్వహించి ‘శ్రీ’ వరిసాగు గురించి చెప్పడము జరిగినది. ఈ సదస్సులో పాల్గొన్న సరస్వతమ్మ చిన్న కమతము పొలము యీ సాగు విధానము లాభదాయకముగా ఉండునని గ్రహించినది.

‘శ్రీ’వరి సాగు విధానము గురించి సరస్వతమ్మ మాటల్లోనే “ నేను రెండు కిలో విత్తనము వాడి ఎత్తైన నారుమడిలో సేంద్రియ ఎరువు మరియు ఆకు సత్తువ చేసినాను.

12 రోజుల లేత నారును మెళుకువగా తీసి అర్ధ ఎకరము పొలములో నాటినాను.


కోనోవీడర్ వాడుతున్న సరస్వతమ్మ

షుమారు 20 రోజుల తర్వాత ప్రాజెక్టుతరఫున ఇచ్చిన “కోనో వీడరు” నేనే త్రిప్పి కలుపును పొలములో కలిసేట్లు చేసాను.

వరి సాగు సాధారణ పద్ధతిలో నాకు పైరు నాటుటకు పది మంది కూలీలు అవసరము అయ్యేవాళ్ళు. కాని ‘శ్రీ’ వరిసాగు పద్ధతిలో నేనే పైరు నాటుకొని కలుపు తీసికొన్నాను. సాధారణపద్ధతిలో 20 కిలోల విత్తనము వాడుకొని 17 బస్తాల ధాన్యము అర్ధ ఎకరములో పొందేదాన్ని. ఇప్పుడు 2 కేజీల విత్తనంతో 22 బస్తాల దిగుబడి సాధించాను” అని సగర్వంగా సరస్వతమ్మ తెలియచేసారు.

శ్రీవరి సాగు గురించి సరస్వతమ్మ ***“ ఈ విధానములో విత్తనము మరియు కూలీల ఖర్చులు బాగుగ తగ్గించాను మరియు ఆదాయము గణనీయముగా పెరిగినది. కాబట్టి చిన్నకమతముల రైతులకు శ్రీవరిసాగు వరదాయనిగా భావించవచ్చు.”*** అని చెప్పారు.

# పాడి ఉత్పత్తిలో 22 లక్షల ఆదాయంతో  గొల్లమాడ గ్రామ మహిళల పురోగతి

## గోపాలమిత్ర మరియు పాలసేకరణ కేంద్ర సహకారంతో

అదిలాబాద్ జిల్లా, కుంటుల మండలంలోని కుగ్రామమైన 'గొల్లమాడ' గ్రామం లోని 400 పాడి ఆవుల ద్వారా 690 లీటర్ల పాల ఉత్పత్తి మాత్రమే జరుగుచుండగా, ఒక ప్రైవేట్ పాల కొనుగోలు ద్వారా లీటరు ఒక్కంటికి రూ.10/- నుండి రూ 12/-లు మాత్రమే గిట్టుబాటు అగుచున్నది. 2007 జనవరిలో ఆంధ్రప్రదేశ్ చెరువుల ఆయకట్టు దారుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, అరణ్య వ్యవసాయ సేవా సంస్థ యొక్క సామాజిక అవగాహన కార్యక్రమము ద్వారా, సంబంధిత గొల్లమాడ గ్రామ పెద్ద చెరువు ఆయకట్టుదారుల ప్రాంతమును పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినారు. నేను వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విభాగాలలో పాడి పరిశ్రమను లాభసాటిగాను, ఆ గ్రామానికి అనువుగా ఉన్నట్లు గుర్తించడమైనది. సంబంధిత గ్రామంలో పశువైద్యశాల లేనందున, ఈ సంస్థ ద్వారా 25 సంవత్సరముల యువకుడు అయిన, శ్రీ లంబాడ భూపతిని పారా వర్కర్‌గా ఎంపిక చేసి, పశుసంవర్ధకశాఖ అధ్వర్యంలో, వరంగల్లులో 16 వారాల గోపాల మిత్ర శిక్షణను సుమారు రూ.16,000/- ఖర్చుతో  ఏర్పాటు చేయడమైనది.



కృత్రిమ  గర్భధారణ

2009 సెప్టెంబర్‌లో, పశుసంవర్ధశాఖ రూ.42,000/- ల విలువగల కృత్రిమ గర్భోత్పత్తి పరికరములను, ఘనీకృత వీర్యమును, ద్రవనత్రజని ద్వారా వీర్యమును నిల్వఉంచు 18.5 లీటర్ల పాత్రను, ఇతర అనుబంధ వస్తువులను పంపిణి చేయడమైనది. ప్రస్తుతము ఆ గోపాల మిత్ర నెలకు రూ. 1200/- లు పొందుచు, పశుసంవర్ధశాఖ సహకారంతో ఇతర పశువైద్య సేవలను అందించుచూ, ఆ గ్రామానికి చేదోడు- వాదోడుగా ఉంటున్నాడు. ఆ గోపాలమిత్ర ద్వారా, ఆ గ్రామ ప్రజలను పశుసంవర్ధక కార్యక్రమముల పట్ల ముఖ్యంగా,  మంచి జాతి  పాడి పశువుల ఎంపిక, కృత్రిమ పశుగర్భోత్పత్తి, మంచి యాజమాన్య పద్ధతులు, మేలుజాతి పశుగ్రాసాల సాగు, పశువుల ఆరోగ్య పరిరక్షణ, పాలు, పాల పదార్థాల ఉత్పత్తులు, సంబంధిత మార్కెటింగ్, మొదలగు విషయాల పై శ్రద్ధ కలగచేసి, ఇప్పటివరకూ 200 ల



పాడిపశువుల నుండి పాలు పితుకుతున్న శ్రీమతి దేవమ్మ

కృత్రిమ గర్భోత్పత్తి చేసిన పశువుల ద్వారా 188 సంకరజాతి  దూడలను పుట్టించి, చక్కటి ఈత శాతం అనగా, 94% ను సాధించి, ఆ గ్రామాన్ని ప్రగతి పథం వైపు నడిపినాడు. ఆ స్ఫూర్తితో ఈ సంస్థ ద్వారా 12 మంది మహిళా రైతులను ప్రోత్సహించి,  పాడి పశువుల సంబంధిత విషయాలపై అవగాహన కల్పించి, పాల సేకరణ కేంద్రంను స్థాపించడమైనది. చిన్నపెట్టుబడితో అనగా రూ.1000/-లతో, వెన్నశాతం నిర్ధారణ చేసే లాక్టోమీటర్, ఇతర పనిముట్లతో మొదలుపెట్టడమైనది.

ఆ గ్రామ సర్పంచ్ శ్రీ యం. గంగాధర్ గారు ప్రారంభోత్సవము చేసిన ఆ పాల సేకరణ కేంద్రం ద్వారా, **ఆ మహిళా పాడి రైతులు , ఇతర రైతులను ప్రోత్సహించడం ద్వారా అధిక దిగుబడి సాధించి, రోజుకు సుమారుగా రూ. 6000/-లు, సంవత్సరానికి రూ.22,00,000/-ల ఆదాయాన్ని సాధించి, ఆ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారు. 2 సంవత్సరాల క్రితం ఇదే గ్రామం ద్వారా పాల ఉత్పత్తి అమ్మకం ద్వార సాధించిన రూ. 3,00,000/-ల ఆదాయం కంటే ఈ రోజు సమిష్టిగా పూర్తి చైతన్యవంతంతో సాధించిన రూ.22 లక్షల సంవత్సర ఆదాయం, ఎంతో శ్రమ, పట్టుదల, శ్రద్ధ, కృషి ద్వారా సాధించడం, చక్కటి విజయానికి స్ఫూర్తి. ఈ విజయగాథలో ప్రాజక్టు వారి ఆర్థిక సహాయం రూ.60,000/-లు మాత్రమే. ఈ విధంగా గ్రామీణ పాడి పశువుల మహిళలు గ్రామ స్వయం సమృద్ధికి తోడ్పడం ఎంతో హర్షనీయం ఇతరులకు ఆదర్శం.**



# నాగసముద్రం పెద్ద చెరువులో బంపర్ చేపల ఉత్పత్తి

అనంతపురం జిల్లాలోని సి.కె.పల్లి మండలంలో గల నాగసముద్రం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం 21 స్త్రీ మత్స్యకార, 40 పురుష మత్స్యకారులతో రిజిష్టరు కాబడి పెద్ద చెరువులో చేపల పెంపకము చేపట్టుచున్నది. వారిలో 20 మంది మాత్రమే భూములు కల్గివున్నారు. 70 హెక్టార్ల ఎఫెక్టివ్ నీటి విస్తీర్ణత, 140 హెక్టార్ల మొత్తం నీటి విస్తీర్ణతతో పెద్ద చెరువు దీర్ఘకాలిక చెరువుగా పరిగణింపబడినది. 25 మిల్లీమీటర్ సైజుగల 70 వేల బొచ్చె, బంగారు తీగ, చేప పిల్లలను సంఘం చెరువులో వదలి 9 టన్నుల చేపల దిగుబడి సాధిస్తూ రూ. 3.15 లక్షల ఆదాయం పొందేవారు.

సామాజిక చెరువుల భాగస్వామ్య అభివృద్ధి పథకం క్రింద చెరువును ఎంపిక చేసి కొత్త పద్ధతులలో చేపల పెంపకం చేపట్టడం వలన చాలమార్పులు సంభవించినట్లు సంఘ అధక్ష్యులైన శ్రీ కె. నారాయణప్ప గారు వివరించారు.



చేప పిల్లలను చెరువులో వదులుతున్న చేపల సంఘసభ్యులు

"అక్టోబరు 13వ తేది 2008 సంవత్సరమున వంద మి.మీటర్ల సైజుగల 1.03 లక్షల బొచ్చె, రాగండె, గడ్డిచేప, బంగారు తీగ చేప పిల్లలను చెరువులో వదలడం జరిగింది. ఇందుకుగాను ప్రాజెక్టు వారి ద్వారా రూ.51,500/- యివ్వడం జరిగింది. ముగ్గురు సంఘసభ్యులము కలసి కొత్త పద్ధతులలో మిశ్రమ చేపల పెంపకం, యాజమాన్యం, మార్కెటింగ్ తదితర అంశాలపై శిక్షణ పొందినాము. నాతో సహా ముగ్గురు సభ్యులను చేపల పెంపకం,

తూకంవేసి, చేపలను అమ్ముతున్న సంఘసభ్యులు



ఉత్పత్తి, మార్కెటింగ్ తదితర అంశాలపై పూర్తి అవగాహన ఏర్పడుట కొరకై కైకలూరు, పల్లెవాడ, తోకలపూడి, కొల్లేరు మొదలగు ప్రదేశాల సందర్శనకు తీసికొని వెళ్ళినారు" అని సంఘ అధ్యక్షులు తెలియజేసినారు.

*"శిక్షణ, ఎక్స్పోజర్ సందర్శనలలో మేము పొందిన అనుభవాన్ని మా నాగసముద్రం చెరువులో ఉపయోగించినాము. దశలవారిగ చేపల పెరుగుదలను ట్రయల్ నెట్టింగ్‌ల ద్వారా పరీక్షించుకున్నాము. మా పశువుల పెండను చాల మంది రైతులము చెరువుపై భాగంలో దిబ్బలుగ (కుప్పలుగ) వేస్తాము వర్షాకాలంలో పెండ కుప్పల నుంచి పెండరసం చెరువులోకి ప్రవేశిస్తుంది. దీనివల్ల చిన్న చిన్న పురుగులు చాల ఉత్పత్తి అయినాయి. బొచ్చె చేపలు వీటిని బాగా తింటాయి."*

| సమయము | వదలబడిన ఫింగర్ లింగ్స్ | చేపల దిగుబడి | | | ఆదాయం | | |
|---|---|---|---|---|---|---|---|
| | | పంట కేజీలలో | పెరుగుదల | పెరుగుదల (శాతం) | రూ. లక్షలలో | పెరుగుదల | పెరుగుదల (శాతం) |
| ప్రాజక్టు ముందు (2007-08) | 70,000 | 9,000 | - | - | 3.15 | - | - |
| ప్రాజక్టు కాలంలో (2008-09) | 1,03,000 | 31.360 | 22,360 | 248 | 9.70 | 6.55 | 208 |

**"గత సంవత్సరం (2008-09) మాకు బంపర్ దిగుబడి వచ్చింది. అంతకు మునుపు (2007-08) సంవత్సరంలో మాకు 9000 కేజీల చేపల దిగుబడి రాగా గత సంవత్సరం 31,000 కేజీల దిగుబడి వచ్చింది. అంతకు మునుపు సంవత్సరం రూ. 3 లక్షల ఆదాయం రాగా గత సంవత్సరం రూ.10 లక్షల ఆదాయం వచ్చినది. మరల 1.03 లక్షల చేప విత్తనాలను వదలినాము. ఈ సంవత్సరంలో చేపలు పట్టుతాము. ఇంకొక బంపర్ దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాము"** అని నారాయణప్ప సగర్వంగా తెలియజేసినారు.


**సమాచారము మరియు ఫిర్యాదుల కొరకు**

**టోల్‌ఫ్రీ నెంబరు : 1800-425-0554 కు ఉదయం 11 : 00 గం.ల నుండి సాయంత్రం 5 : 00 గం.ల మధ్య సంప్రదించగలరు.**

**రాష్ట్ర పథక సంచాలకులు**

**ఆంధ్రప్రదేశ్ సమాజ ఆధారిత చెరువుల యాజమాన్య పథకం**

నీటి పారుదల మరియు అయకట్టు అభివృద్ధిశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,

ఎ.పి.ఎస్.ఐ.డి.సి భవనము, మొదటి అంతస్తు, వీధి నెం.13, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034

Website: www.apmitanks.in Email: pmu@apmitanks.in